## 17828 దిగువకు వస్తే

# మరింత పతనం




**సమీక్ష:** గత వారం మార్కెట్ అధిక ఊగిసలాట అనంతరం 2 శాతం నష్టపోయింది. ఇంధన ధరల పెంపు ఉండొచ్చన్న వార్తలకు తోడు అంతర్జాతీయ మార్కెట్లూ బలహీనంగా ఉండడంతో సెన్సెక్స్ పెద్దగా మార్పులేమీ లేకుండా మొదలైంది. అయితే అంతర్జాతీయ బలహీనతలు కొనసాగడంతో మదుపర్లు వరుస మూడు వారాల లాభాలను స్వీకరించారు. అయితే డెరివేటివ్‌ల ముగింపు, తగ్గిన ఆహార ద్రవ్యోల్బణం కారణంగా గురువారం కాస్త కోలుకుంది. కేబినెట్ ఆమోదించిన డీటీసీ బిల్లులో కనీస ప్రత్యామ్నాయ పన్ను(మ్యాట్)ను 18% నుంచి 20 శాతానికి పెంచాలన్న ప్రతిపాదన ఉండడంతో పాటు మూలధన వృద్ధి పన్నుపై అనిశ్చితి ఏర్పడడంతో శుక్రవారం భారీ అమ్మకాలు జరిగాయి.

**ఎఫ్ఐఐల తీరు:** ఎఫ్ఐఐల కొనుగోళ్ల వేగం కాస్త నెమ్మదించింది. రూ.1484 కోట్ల నికర కొనుగోళ్లకే వారు పరిమితమయ్యారు. ఫండ్లు మాత్రం రూ.1409 కోట్ల నికర అమ్మకాలు చేశాయి.

**రంగాల వారీగా:** వడ్డీ రేట్లపై ఆధారపడే స్థిరాస్తి, బ్యాంకింగ్ షేర్లు అధికంగా నష్టపోయాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో లోహ షేర్లూ బలహీనపడ్డాయి. మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్ఎమ్‌సీజీ, యంత్ర పరికరాల షేర్లు రాణించాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:7గా నమోదవడం చూస్తే మార్కెట్లో లాభాల స్వీకరణ జరిగిందన్న విషయం స్పష్టమవుతోంది.

**భవిష్యత్ అంచనా:** మూడు వారాల వరుస లాభాల తర్వాత మార్కెట్ గత వారం నష్టాలను చవిచూసింది. 18050 కంటే దిగువకు పడిపోవడం ద్వారా సెన్సెక్స్ స్వల్పకాల దిద్దుబాటులోకి అడుగుపెట్టినట్లు అర్థమవుతోంది. ఈ బలహీనత సమీప భవిష్యత్‌లోనూ కొనసాగవచ్చు. స్వల్పకాలంలో మార్కెట్ 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) అయిన 17828 వద్ద బలమైన మద్దతు లభించొచ్చని అంచనా. ఒక వేళ ఆ కీలక స్థాయినీ పోగొట్టుకుంటే మాత్రం 17374కూ కుంగవచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** సోమవారం పార్లమెంటు ముందుకు రానున్న ప్రత్యక్ష పన్ను స్మృతి(డీటీసీ) బిల్లును మార్కెట్ నిశితంగా పరిశీలించొచ్చు. మూలధన లాభాలపై విధించే పన్ను వంటి విషయాల్లో ప్రతికూల నిర్ణయాలేమైనా ఉంటే దిద్దుబాటుకు లోనుకావచ్చు. ఆ తర్వాత వాహన, సిమెంట్, టెలికాం వంటి కీలక పరిశ్రమల నెలవారీ విక్రయాలు సైతం ప్రభావాన్ని చూపొచ్చు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, యురోపియన్ సెంట్రల్ బ్యాంక్‌ల ప్రకటనలూ కీలకం కానున్నాయి.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17828, 17600, 17374; **తక్షణ నిరోధ స్థాయిలు:** 18156, 18238, 18309

**స్వల్పకాలంలో మార్కెట్ 17828 కీలక స్థాయి దిగువకు వస్తే మరింత పతనం దిశగా కదలొచ్చు.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*